క్లుప్తంగా

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ట



జగ్గయ్యపేట: పట్టణంలోని అద్దాలబజార్‌లో వేంచేసియున్న మహాలక్ష్మీ అమ్మవారి (వెండి దేవాలయం) విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 8.59 గంటలకు తాత్వికుడు గెంటేల వెంకట రమణ దంపతులచే యంత్ర స్థాపన, విగ్రహ పునః ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. అనంతరం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. వెంకట రమణ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అర్చకులు జొన్నబొట్ల కిషోర్‌శర్మ, వెంకటరమణశర్మ, సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవాలలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను దంపతులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పెనుగంచిప్రోలు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ కార్యాకర్తలు పేర్కొన్నారు. పౌష్టికాహారం ఏడో పక్షోత్సవాల సందర్భంగా పెనుగంచిప్రోలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించటంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు మంచి పోషకవిలువలతో కూడిన ఆహారం అవసరమన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, పెద్దలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేల రాలిన మామిడి



పెనుగంచిప్రోలు: గాలి, చిరుజల్లులకు మామిడి కాయలు నేలరాలాయి. మంగళవారం రాత్రి అకస్మాత్తుగా మేఘాలు చల్లబడి గాలులు వీచి చిరుజల్లులు పడ్డాయి. ఈఏడాది చెట్లకు మామిడికాయలు తక్కువగా కాశాయి. ఈక్రమంలో సోమ, మంగళవారాల్లో వచ్చిన గాలిదుమ్ముకు కాయలు నేలరాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం



ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించవచ్చని ఎన్టీటీపీఎస్ ఎస్ఈ వై.ఉమామహేశ్వరరావు అన్నారు. ఎస్‌వీసీటీ ఆధ్వర్యంలో సీకాలనీ ఆడిటోరియంలో ఉచిత యోగా శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యోగా సాధనతో శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయన్నారు. జీవన క్రియలు సజావుగా జరుగుతాయని చెప్పారు. యోగా గురువు లంకే జనార్దన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో నేడు యోగాను ఆచరిస్తున్నారన్నారు. అనంతరం సాధకులతో సూక్ష్మ వ్యాయామాలు, యోగా, ప్రాణాయామం, ధ్యాన సాధన చేయించారు.

రామాలయంలో అన్నదానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో బుధవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అన్నదానాన్ని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామి వారికి పలు విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రముఖులు శీరం వెంకటరావు, కామందుల నరసింహారావు, బెవర శ్రీనివాసరావు, కొరగంజి భాస్కరరావు, మజ్జి శ్రీనివాసరావు, ఫణుకు రమా, పోతిన దర్మారావు, పోతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం...ప్రయాణం నరకప్రాయం



పెనుగంచిప్రోలు-సుబ్బాయి గూడెం రోడ్డుకు ఏర్పడిన రంధ్రం

పెనుగంచిప్రోలు: గతేడాది సంభవించిన వరదల కారణంగా దెబ్బతిన్న పెనుగంచిప్రోలు మండలంలోని పలు గ్రామాల రోడ్లు ఏడునెలలుగా మరమ్మతులు, అభివృద్ధికి నోచుకోకపోవడంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర అవస్థలుపడుతున్నారు. వరదలకు రోడ్లు కొట్టుకుపోవడంతో ఆయా రోడ్లపై ప్రయాణం ప్రజలకు నరకప్రాయంగా మారింది. గతేడాది సెప్టెంబర్‌లో మునేరు వరదలకు వత్సవాయి మండలంలోని వేములనర్వ-పెనుగంచిప్రోలు రోడ్డు, పెనుగంచిప్రోలు-ముచ్చింతాల, పెనుగంచిప్రోలు-అనిగండ్లపాడు, అనిగండ్లపాడు-గుమ్మడిదుర్రు, పెనుగంచిప్రోలు-సుబ్బాయిగూడెం రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. పెనుగంచిప్రోలు నుంచి అనిగండ్లపాడు వెళ్లే రోడ్డుకు తిరునాళ్ల ఉత్సవాల ముందు గుంతలు పూడ్చినా నాణ్యత లేక పోవటంతో తిరిగి గుంతలు ఏర్పడ్డాయి. పెనుగంచిప్రోలు నుంచి సుబ్బాయిగూడెం, అనిగండ్లపాడు నుంచి గుమ్మడిదుర్రు రోడ్డుకు కంకరపోసి వదిలేయడంతో వాహనదారులు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకుని ఈ రోడ్ల మరమ్మతులు పూర్తిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కంకరవేసి వదిలేసిన పెనుగంచిప్రోలు-సుబ్బాయిగూడెం రోడ్డు



గుంతలమయమైన పెనుగంచిప్రోలు-వేములనర్వ రోడ్డు



ప్రమాదకరంగా ముచ్చింతాల-తాళ్లూరు రోడ్డు



కంకర మొనతేలి ఉన్న అనిగండ్లపాడు-గుమ్మడిదుర్రు రోడ్డు

సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతి

జగ్గయ్యపేట: పట్టణంలోని ఉక్కు కళావేదికలో బుధవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదవ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ పట్టణంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఊర చెరువు అభివృద్ధి జరిగిందని, మరిన్ని నిధులు మంజూరు చేయటంతోపాటు ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలన్నారు. ఎర్ర కాల్వ, వేపల వాగును ప్రక్షాళన చేయాలని, వీధి కుక్కలను నియంత్రించాలని, బలుసుపాడు రోడ్డు నుంచి జగనన్న కాలనీ వరకు వీధిలైట్లు అందించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా 17వ వార్డులో లోఓల్టేజి సమస్య అధికంగా ఉందని విద్యుత్ స్తంభాలను మార్చడంతోపాటు బీసీ కమ్యూనిటీ హాల్‌ను అభివృద్ధి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వైస్‌చైర్మన్ హఫీజున్నీసా

గ్రామాల అభివృద్ధికి చర్యలు

ఎంపీపీ రమాదేవి

నందిగామరూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ పెసరమల్లి రమాదేవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లోని సమస్యలను ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాలలో రైతులు విధిగా పంట నమోదు చేసుకోవాలని, జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖాధికారి ఖాశీం సూచించారు. మండలంలోని తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులు సూచించారు.

బిల్లులు మంజూరు చేయాలి..

మండలంలోని ఆయా గ్రామాలలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన 30 గోకులం షెడ్లు, ప్రస్తుతం నిర్మించిన 40 గోకులం షెడ్లకు నిధులు మంజూరు చేయాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు పశుసంవర్ధకశాఖ అధికారులను కోరారు. మండలంలోని కొణతమాత్మకూరు గ్రామంలోని వాటర్ ట్యాంక్‌పై మూత మరమ్మతులకు గురైందని మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ మేడా కోటేశ్వరరావు కోరారు. ఎంపీటీసీ సభ్యులకు గౌరవవేతనం మంజూరు చేయాలని సూచించారు. వేసవి కాలం దృష్ట్యా మండలంలోని ఆరోగ్య కేంద్రాల్లో అన్నిరకాల మందులతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు సైతం అందుబాటులో ఉన్నాయని హెల్త్ సూపర్‌వైజర్ బిక్షాలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని రానున్న విద్యా సంవత్సరం నుంచి గ్రామాల్లో మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంఈవో పద్మ తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ఆకుల హనుమంతరావు, అన్నం పిచ్చయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నందిగామ ఎంపీపీ పెసరమల్లి రమాదేవి

గ్యాస్ ధరలను తగ్గించాలంటూ ఆందోళన

జగ్గయ్యపేట: పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలంటూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో బుధవారం ఆందోళన చేశారు.

పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గ్యాస్ సిలిండర్లకు కట్టెలు కట్టి వంట చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ పట్టణ, మండల కార్యదర్శి ఎస్.నాగమణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. గ్యాస్ సిలిండర్‌పై ఇంతకు ముందెన్నడు లేనివిధంగా రూ. 50, పెట్రోలు, డీజిల్‌పై రూ. 2 పెంచడం దారుణమన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుంటే ప్రభుత్వాలు ధరలు పెంచడంలో ఆంతర్యమేంటో తెలియడం లేదన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజల జీవనాన్ని మరింత ఇబ్బందుల్లో నెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో నాయకులు సీపీఎం నాయకులు నాగేషు, రాంప్రసాద్, కోట కృష్ణ, వెంకటేశ్వర్లు, లింగారావు, గౌసమియా తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఈదురు గాలులకు నేలవాలిన మునగ

రైతులకు తీవ్ర నష్టం

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలో రెండు రోజుల కిందట వీచిన ఈదురు గాలులతో ఉద్యాన పంటలైన మునగ తోటలు నేలవాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని కేతనకొండ, మూలపాడు, కొటికలపూడి, జూపూడి గ్రామాల్లో సుమారు 15 ఎకరాల్లో రైతులు మునగసాగు చేపట్టారు. ఏడు నెలలుగా మొక్కలు ఏపుగా పెరిగి పూత, కాపు దశలో ఉన్న సమయంలో అకాల వర్షం, ఈదురు గాలులతో మొక్కలు విరిగిపోగా, మరికొన్ని మొక్కలు పూర్తిగా వంగిపోయి నేలవాలాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు దెబ్బతిన్న మునగ తోటలను పరిశీలించారు. మునగ మొక్కలు వేర్లతో సహా బయటకు పీక్కొస్తేనే ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని అధికారులు చెబుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఎకరాకు రూ. 30 వేల పెట్టుబడి

ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. అంతకుముందు వరద ప్రభావంతో మునగ పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. ఏడాదిలో రెండు సార్లు సాగు చేయడంతో రైతులు అధికంగా ఖర్చులు భరించాల్సి వచ్చింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని మునగ రైతులు కోరుతున్నారు.



జూపూడి లంక భూముల్లో ఈదురు గాలులకు నేలవాలిన మునగ మొక్కలు

అమ్రితసాయిలో టెక్నో సైబర్ ఫెస్ట్

కంచికచర్ల : మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ స్థాయి టెక్నో-సైబర్ ఫెస్ట్ ఆసిస్ట్ ఆహ్వాన్ 2కె25 నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకను పెంపొందిస్తాయన్నారు. దేశసాంకేతిక అభివృద్ధి లో తమవంతు పాత్ర పోషించాలని విద్యార్థులకు సూచించారు. ఈ పోటీలకు దేశ నలుమూలల నుంచి పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు హాజరై ఆయా ప్రాజెక్టులతో ప్రతిభను చాటారన్నారు. సైబర్ క్యాంప్ ట్రెజర్ హంట్, కోడింగ్ కంటెస్ట్, ఐడియా ఫోర్జ్, పోస్టర్ ప్రజెంటేషన్స్ తదితర సాంకేతిక అంశాలపై పోటీలు నిర్వహించినట్లు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ స్టూడెంట్ యాక్టివిటీ క్లబ్ ద్వారా కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఈ-టెక్నోసైబర్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నారన్నారు. అత్యుత్తమ ఇంజినీర్‌గా ఎదగాలంటే క్రమశిక్షణ, స్వయం నియంత్రణ, నూతన సాంకేతిక అంశాలపై పట్టు కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సిస్టమ్ హ్యాకింగ్‌లో అమ్రితసాయి సీఏసీ విద్యార్థులు వి.చరణ్ ప్రకాష్ అండ్ టీం ప్రథమ బహుమతిని, మొబైల్ హ్యాకింగ్‌లో ఈసీఈ విద్యార్థులు సీహెచ్ బాలాజీ అండ్ టీం సభ్యులు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. కోడింగ్ కంటెస్ట్‌లో మిక్ ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విద్యార్థులు కే పాల్ జోనాథన్, కే ధను వెంకటేష్, షేక్ ఇసాక్ ప్రథమ బహుమతిని అమ్రిత సాయి కళాశాల సీఎస్‌డీ విద్యార్థులు బీ జీవన్‌కుమార్ బీ తులసీరామ్ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఐడీయా ఫోర్జ్ విభాగంలో అమ్రితసాయి కళాశాల సీఎస్‌డీ విద్యార్థులు ఎస్ నరేంద్ర, కే గోపాలకృష్ణ మొదటి బహుమతిని గెలుచుకోగా మహారాష్ట్ర పూణేకు చెందిన సింబైసిస్ ఇనిస్టిట్యూట్ ధీమన్, జైన్, శర్మ, వైభర్ రెండో బహుమతిని గెలుచుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



టెక్నోఫెస్ట్‌లో విద్యార్థుల పోస్టర్ ప్రజెంటేషన్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శశిధర్, అధ్యాపకులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల సెక్రటరీ కె.రామ్మోహనరావు

నీటిని పొదుపుగా వినియోగించాలి

నందిగామ టౌన్: ప్రతి నీటి బొట్టు విలువైనదేనని నీటిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి సూచించారు. పట్టణంలోని 14వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హలో చైర్మన్ కార్యక్రమంలో వార్డులో మంచినీటి సమస్య ఉందని ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో మంచి నీటి ట్యాంకర్‌తో సరఫరా చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు



పెనుగంచిప్రోలులో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీపీ గాంధీ, ఎంపీడీఓ జి.శ్రీను



జుజ్జూరులో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు



కంచికచర్లలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, బ్యాంకు అధికారులు

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీసీ కార్పొరేషన్‌తోపాటు వివిధ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో మొత్తం 6 బ్యాంక్‌ల పరిధిలో 73 యూనిట్లకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో రుణాలకు సంబంధించి 617 మంది దరఖాస్తు చేసుకోగా 461 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీఓ జి.శ్రీను తెలిపారు. అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసిన వారిలో పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఏఓ సిద్దారెడ్డి, ఈవోపీఆర్‌డీ సుబ్బారావు, బ్యాంక్ మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: దరఖాస్తుదారుల అర్హత ఆధారంగా కార్పొరేషన్ రుణాలను మంజూరు చేస్తామని ఎంపీడీవో అరుంధతీ దేవి తెలిపారు. మండలంలోని జుజ్జూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆయా కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి బుధవారం బ్యాంకు అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు చెందిన 988మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు 523మంది హాజరయ్యారన్నారు. దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అర్హులను గుర్తించి, వారికి రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొని ఇంటర్వ్యూలు చేశారు. మండలంలో 16 గ్రామాలకు చెందిన 846 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా , వారిలో 603మంది ఇంటర్వ్యూకు హాజరైన ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్వ్యూల్లో యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐ, సప్తగిరి, ఇండియన్ బ్యాంకుల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.సుబ్రహ్మణ్యం, ఇందుపల్లి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యమ్మ అమ్మవారి జాతర



నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాల్లో భాగంగా బుధవారం రజతకవచాలంకృతాలంకారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవాయిద్యాలతో తోరణపాకు కట్టుట, అమ్మవారికి పంచామృతాభిషేకాలతో పంచసూక్త విధంగా స్నపన అలంకారములు, సుప్రభాత సేవ నిర్వహించారు. మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, దక్షాదారణ, శ్రీచక్రనవవర్ణనార్చన, కుంకుమార్చనలు, అఖండ దీపస్థాపన, కలశ స్థాపన, మండపారాధనతోపాటు మృత్యుంజయ, నవగ్రహ సరస్వతీ, చండీ సహిత రుద్ర హోమాది క్రతువులు జరిపించారు. సాయంత్రం సువర్ణ పుష్పాలతో ఖడ్గమాలార్చన, అమ్మవారికి పంచహారతులు కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో హరినాగబాబు, ఉత్సవ కమిటీ సభ్యుడు మంచాల మాధవరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం నూతనంగా తలపెట్టిన విజన్ 2040పై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నితిన్ మాట్లాడుతూ విజన్ 2040లో భాగంగా ఆయా ఆరు అంశాలను గ్రామ స్థాయిలో సచివాలయ సిబ్బంది, అధికారులు కలిసి ప్రజలకు వివరించారు. గ్రామ పన్నులపై అవగాహన, అక్షరాస్యత, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు, వర్క్‌ఫ్రం హోం ఉద్యోగులు, జీడీపీ, ఏడాదిలో అభివృద్ధి చేసే పనులు, పేదవారి గుర్తింపు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఏఎస్‌వో ఉపేంద్ర, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాడిరైతులకు బోనస్ మంజూరు



కంచికచర్ల: పాడి రైతుల సంక్షేమం కోసం కృష్ణా మిల్క్ యూనియన్ విజయ డెయిరీ ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటుందని మైలవరం క్లస్టర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి పేర్కొన్నారు. మైలవరం క్లస్టర్ పరిధిలోని బీఎంసీ పరిధిలో ఉన్న 17పాల సంఘాలకు మూడోవిడత నాలుగు నెలల బోనస్ కింద రూ. 1.97లక్షల విలువగల చెక్కును క్లస్టర్ మేనేజర్‌కు బుధవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా నష్టపోయిన పాల ఉత్పత్తిదారులను ఆదుకుంటున్నామన్నారు. పాడి రైతులకు పాల ధరను పెంచి బోనస్ కూడా తగ్గకుండా ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మొగులూరు, కునికెనపాడు, కంచికచర్ల, చెవిటికల్లు, పొన్నవరం సంఘ అధ్యక్షులు వి.తిరుపతిరావు, కె.పవన్ కుమార్, కె.కవిత, ఎ.అప్పారావు, వి.ప్రసాద్, సంఘ వేతన కార్యదర్శులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన బావి



గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లి బొడ్డురాయి సెంటర్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఓ పాడుబడిన బావి ప్రమాదకరంగా మారింది. బొడ్డురాయి సెంటర్ నుంచి మున్నేరు, వైరా నదులకు వెళ్లే రోడ్డు పక్కన ఇళ్ల మధ్యలో ఈ పాడుబడిన బావి ఉంది. రోడ్డు పక్కనే ఉన్న ఈ వినియోగంలో లేని ఈ బావి శిథిలావస్థకు చేరింది. బావి గోడలు కూడా దెబ్బతినడంతో ప్రమాదవశాత్తు చిన్నారులు అటువగా వెళ్లి ప్రమాదానికి గురవుతారేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న ఎనిమిది దశాబ్దాల నాటి ఈ బావిని పూడ్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.